VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 17

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 22 మే 2025

## నేడే ప్రారంభోత్సవం

## DEVI SHRESTA
GOLD & DIAMONDS

విజయవాడ ఎఫ్.ఎం.ప్లాజా, జైహింద్ కాంప్లెక్స్, గ్రౌండ్ ఫ్లోర్ నందు

## దేవి శ్రేష్ఠ గోల్డ్ అండ్ డైమండ్స్

కొత్త షోరూమ్ ప్రారంభోత్సవం



ప్రముఖ సినీ తార
నిధి అగర్వాల్ గారిచే ప్రారంభం

అందరికి ఇదే ఆహ్వానం

ఆహ్వానించువారు

వంకదారు జగదీష్ | వంకదారు సుధాకర్ | బొడ్డు మురళీకృష్ణ | మడుపల్లి అనీష్

88887 66252, 93469 87989

శ్రేయోభిలాషులు

శ్రీ కొత్తూరి సూర్యనారాయణ, శ్రీ తూనుగుంట్ల వాసు, శ్రీ అడపా పుల్లారావు, శ్రీ కోట శివ, శ్రీ గుడిమేట్ల మురళీ
బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల శుభాభినందనలతో....

# బ్రహ్మోత్సవ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అన్నా తనయుడు కృష్ణచైతన్య





**కంభం (ప్రకాశం జిల్లా),కలంకౌంటర్ :** కంభం మండలం రావిపాడు గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవ మహోత్సవ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న మాజి శాసనసభ్యులు,మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

# యోగా..



**తిరువూరు,కలంకౌంటర్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగ మాసోత్సవం సందర్భంగా తిరువూరు తహసిల్దారు కార్యాలయ అవరణలో యోగ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కే లక్ష్మీ, ఆర్ఐ ఎం.వెంకటేశ్వరరావు, యోగా ట్రైనర్స్ ధారా నవీన్,దారా రాము, దేవిశెట్టి రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హస్త కళల చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన - జనసేన నేతలు..



**తిరుపతి,కలంకౌంటర్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ కు కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ హస్తకళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించిన శుభ సందర్భంగా.. తిరుపతి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యులు సుమన్ బాబు బుధవారం టెంపుల్ టౌన్ వారి నివాసంలో జనసేన నేతలు 27 వార్డ్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఆది, సుధాకర్, సుమంత్, పవన్ కుమార్, శివ లతో కలిసి పళ్ళ బొకే ను అందించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు అయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యొక్క ఆశయ సాధనకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత లభిస్తుందని దిశ నిర్దేశించారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో తెలంగాణ హైకోర్టు జస్టిస్ పి శ్రీ సుధా





**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని తెలంగాణ హైకోర్టు జస్టిస్ పి. శ్రీ సుధ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన జస్టిస్ పి. శ్రీ సుధ దంపతులను డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బుద్ధ పవన్ కుమార్ శర్మ బుద్ధు సతీష్ శర్మ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం పి. శ్రీ సుధ దంపతులు శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సుధ దంపతులను ఆలయ మర్యాదలతో శ్రీరామ వరప్రసాదరావు ఘనంగా సత్కరించి, ప్రసాదాలను అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో తాసిల్దార్ మేడపాటి శ్రీవిద్య, మోపిదేవి ఎస్సై యెలుగుబంటి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చల్లంగా చూడమ్మా గంగమ్మతల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు

● ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్న సీఎం ● పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు





**కుప్పం,కలంకౌంటర్ :** చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో కుటుంబసమేతంగా పాల్గొన్నారు. సతీమణి భువనేశ్వరితో కలిసి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆలయం పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాతర కావడంతో దంపతులు ఇరువురు టీటీడీ తరపున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే లభించే గంగమ్మ విశ్వరూప దర్శనాన్ని చేసుకుని, రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకున్నారు. సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు, పలువురు నాయకులు జాతరలో పాల్గొన్నారు. గంగమ్మ దర్శనానికి ముందుగా కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గంగమ్మ దర్శనం అనంతరం సీఎం అమరావతికి తిరుగు ప్రయాణమయ్యారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాలుగు కుంకీ ఏనుగులు అప్పగించిన కర్ణాటక









**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కర్ణాటక నాలుగు కుంకీ ఏనుగులను అందజేసింది. మొత్తం ఆరు కుంకీ ఏనుగులు ఇవ్వవలసి ఉండగా, రెండు ఏనుగులను వాటి ఆరోగ్య కారణాలు, శిక్షణ పూర్తి కాకపోవడం వంటి కారణాల వల్ల మరో దఫా అందజేయనున్నట్టు కర్ణాటక ప్రభుత్వం తెలియచేసింది. బుధవారం బెంగళూరులోని కర్ణాటక విధాన సౌధ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే కుంకి ఏనుగులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో అటవీ అధికారులకు అందించారు. కుంకీ ఏనుగుల అప్పగింతకు సంబంధించిన ఒప్పంద పత్రాలను, లైసెన్స్ లు, వాటి సంరక్షణకు సంబంధించిన విధివిధానాల పత్రాలను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య . పవన్ కళ్యాణ్ కి అందజేశారు. శాస్త్రోక్తంగా గజ పూజ నిర్వహించిన అనంతరం జెండా ఊపుతూ కర్ణాటక ప్రభుత్వాధినేతలు కుంకీలను సాగనంపగా, పూల వర్షం కురిపిస్తూ పవన్ కళ్యణ్ ఆహ్వానం పలికారు. ఈ నాలుగు ఏనుగులను కర్ణాటక అటవీశాఖ అధికారుల నుంచి ఆంధ్రప్రదేశ్ అటవీ అధికారులు అధికారికంగా స్వీకరించారు. దేవా, కృష్ణ, అభిమన్యు, మహేంద్ర అనే పేర్లు కలిగిన కుంకీ ఏనుగులు ఆంధ్రప్రదేశ్ కి అప్పగించారు. కర్ణాటకకు చెందిన మావటీలు రెండు నెలలపాటు కుంకీ ఏనుగులతో ఉండి ఆంధ్రప్రదేశ్ మావటీలకు వాటి సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని ఏనుగులు ఇవ్వడానికీ సిద్ధమని ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కర్ణాటక ఇచ్చిన కుంకీ ఏనుగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరు రాష్ట్రాల అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అలిపిరి పేలుడు సూత్రదారి నంబాల హతం



**విజయవాడ, కలంకౌంటర్ :** టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుపై 20 ఏళ్ల క్రితం తిరుపతి సమీపంలోని అలిపిరిలో హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. మనం ఇప్పుడు మావోయిస్టులుగా పిలుచుకుంటున్న నాటి నక్సలైట్లు ఈ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బుల్లెట్ ప్రూఫ్ కారులో ప్రయాణిస్తున్న చంద్రబాబు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. అప్పటికే 9 ఏళ్ల పాటు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన బాబు.. ఆ తర్వాత అప్రహతిహతంగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఏపీకి మరోమారు సీఎంగా పనిచేస్తున్నారు. నాడు కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళుతున్న చంద్రబాబుపై నక్సలైట్లు క్లైమోర్ మైన్లు పెట్టి పేల్చారు. ఈ దాడికి నాటి నక్సల్స్ ఉద్యమంలో గెరిల్లా పోరాటానికి నాందీ పలికిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్న తాజాగా బుధవారం ఛత్తీస్ గఢ్ లో జరిగిన ఎన్ కౌంటర్ లో హతమైపోయాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నంబాల.. వరంగల్ లోని ఇప్పటి ఎన్ఐటీ.. నాటి ఆర్ఈసీలో ఇంజినీరింగ్ చదివి ఆ తర్వాత నేరుగా నక్సల్స్ ఉద్యమంలోకి ఎంట్రీ ఇచ్చేశాడు. ఎంట్రీ ఇవ్వడంతోనే గెరిల్లా పోరాటాలకు తెర లేపిన నంబాల కీలక రాజకీయ నేతలను టార్గెట్ చేస్తూ సాగాడు. దండకారణ్యంలో కీలక భూమిక పోషించిన నంబాల... మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు మావోయిస్టులను సమూలంగా ఏరివేసేందుకు భారీ ఆపరేషన్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ లో ఇప్పటికే మావోయిస్టులకు పెద్ద ఎత్తున దెబ్బలు తగలగా.. తాజాగా బుధవారం చత్తీస్ గఢ్ లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో 26 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో నంబాల కూడా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. చంద్రబాబుపై హత్యాయత్నంతో పాటుగా బలిమెల వంటి కీలక ఆపరేషన్లు కూడా నంబాల నేతృత్వంలోనే జరిగినట్లు సమాచారం. ఇక రాష్ట్ర విభజన జరిగిన తర్వాత విశాఖ జిల్లా పరిధిలో నాటి టీడీపీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే సివేరీ సోమలను కూడా మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ హత్యలకు కూడా నంబాలనే వ్యూహకర్తగా వ్యవహరించారట. మావోయిస్టుల ప్రస్థానంలో కీలక భూమిక పోషించడంతో పాటుగా నక్సల్స్ పేరును మావోయిస్టులుగా మార్చే ప్రక్రియలోనూ నంబాలది కీలక భూమికే. నంబాలపై రూ.1.5 కోట్ల మేర రివార్డు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక ఫత్తుల్లాబాద శ్రీ ప్రపత్యాంజనేయ స్వామి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ భూ సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు రామసారథి నేతృత్వంలో పూజాదికాల అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య చెన్నకేశవ స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం నిర్వహించిన శాంతి హోమంలో పలువురు భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రామసారథి మాట్లాడుతూ ఈ ఆలయంలో ప్రపత్యాంజనేయ స్వామి స్వయంభువుగా వెలిశారన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా గురువారం స్వామివారిని కన్నుల పండుగగా అలంకరించి ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.




వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరువూరు కౌన్సిలర్లు బుధవారం కలిశారు. తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా తమపై టీడీపీ నాయకుల దాడి, దౌర్జన్యం గురించి వైఎస్ జగన్‌కు కౌన్సిలర్లు వివరించారు. పోలీసులు, కూటమి నేతలు, టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన తీరును పార్టీ నేతలు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు.

**–తిరువూరు,కలంకౌంటర్ :**

# అప్పన్న ప్రధానార్చకుడు మృతి

● రమణాచార్యులకు ఘనంగా నివాళులు



**సింహాచలం,కలంకౌంటర్ :** శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవాలయ ప్రధానార్చకుడు (2) ఇరగవరపు రమణాచార్యులు (58) గుండెపోటుతో మరణించారు. రెండు రోజుల కిందట ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు సింహాచలలేశుని పూజాది కైంకర్యాలలో విశేష సేవలందించిన రమణాచార్యులు అకాల మరణం పట్ల సింహాచలం దేవస్థానం ఉద్యోగులతో పాటు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. 98 వార్డు పద్మావతి నగర్ లో నివాసముంటున్న రమణాచార్యుల ఇంటికి వెళ్ళి ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సింహాద్రినాథుడు కుటుంబ సభ్యులకు ధైర్యాన్నివ్వాలని పలువురు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈయనకి భార్య కుమార్తె,కుమారుడు ఉన్నారు. రమణాచార్యుల మరణం తీరని లోటని ఆలయ వైదిక పెద్దలు, అధికారులు నివాళులర్పించారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో లు ఎన్ ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాస్, మాజీ దర్మ కర్తలు గంట్ల శ్రీను బాబు, సూరిబాబు, కప్ప స్తంభము నాయుడు, ప్రసాద్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. రమణాచార్యులు సేవలు వీరు కొనియాడారు. అడవివరం స్మశాన వాటికలో అంత్య క్రియలు నిర్వహించారు..

# జాతీయ రెజ్లింగ్ పోటీలకు నిహారిక,కుమార్



**విజయవాడ,కలంకౌంటర్ :** ఈ నెల 25 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని పల్వాల్ లో జరిగే అండర్ -17 జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు బి.నిహారిక,బి.కుమార్ లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఎన్ టి ఆర్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇంచార్జి కార్యదర్శి డి శ్రీనివాసరావు తెలిపారు.ఇటీవల చిత్తూరు లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో త్రివేణి కళాశాల కు చెందిన నిహారిక 36-40 కేజీల విభాగం లోను,41-45 కేజీల విభాగం లోఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్ కు చెందిన బి.కుమార్ లు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

# అక్కినేని కళాశాలకు నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు

**గుడివాడ,కలంకౌంటర్ :** స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశా లకు సిజిపిఏ 3.06 స్కోర్ తో నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జె.ఎస్. కుమార్ తెలియచేసారు. ముగ్గురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం కళాశాలలోని వసతులను, బోధనా పద్ధతులను, పరిశోధన గ్రంధాలను, లైబ్రరీ మరియు క్రీడా ప్రాంగణాలను నిశితంగా పరిశీలించి ఈ గుర్తింపు ఇచ్చారని, కళాశాల మూడవ సారి ఈ నాక్ అసెస్మెంట్ మరియు అక్రిడిటేషన్ లో పాలు పంచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఘనత సాధించడానికి పట్టుదలతో కృషి చేసిన అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందిని కళాశాల పాలకవర్గ కార్యదర్శి కే.ఎస్. అప్పారావు, అధ్యక్షులు ఎల్. ఆర్.కె. ప్రసాద్, కోశాధికారి పి.కృష్ణ ప్రసాద్ మరియు ఇతర పాలకవర్గ సభ్యులు అభినందించారు.

# మంగినపూడి బీచ్ ను శాప్ చైర్మన్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వచ్చే జూన్ నెల 5వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జరగనున్న మసుల ఫెస్ట్ లో భాగంగా జల క్రీడలను, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్ పోటీలను అధికారులతో సమన్వయం చేసుకొని సమర్థవంతంగా నిర్వహిస్తామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం మచిలీపట్నం మంగినపూడి బీచ్ ను శాప్ చైర్మన్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న స్వాగత తోరణం ఏర్పాట్లను రేఖా చిత్రపటం ద్వారా ఏ ఏ కార్యక్రమాలు ఎక్కడ నిర్వహిస్తున్నారు తదితర వివరాలను శాప్ చైర్మన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సముద్రతీరం వెంబడి పర్యటించి జల క్రీడలు నిర్వహించే ప్రదేశం పరిశీలించి, క్రీడలు జరిగే సమయంలో దాదాపు 8,000 మంది దాకా ప్రజలు వీక్షించేందుకు వీలుగా తగిన గ్యాలరీలు, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టం, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ వలయాలు మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని చైర్మన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గతంలో మచిలీపట్నం అన్నింటికి ప్రధాన కేంద్రంగా ఉంటూ దేదీప్యమానంగా వెలుగొందిందన్నారు. దురదృష్టవశాత్తు వెనుకబడు తూ వచ్చిందన్నారు. 2014-19 లో పూర్వవైభవాన్ని తీసుకొని రావడానికి అప్పటి రాష్ట్ర క్రీడలు యువజన శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అనేక మంచి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మరలా నేడు మంత్రివర్యులుగా బాధ్యతలు చేపట్టాక పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మంగినపూడి బీచ్ ఉత్సవాలను వచ్చే జూన్ నెల 5 వ తేదీన పెద్ద ఎత్తున ప్రారంభించేందుకు మంత్రివర్యులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. తద్వారా మచిలీపట్నంను మంచి పర్యాటక సాంస్కృతిక ఆధ్యాత్మిక క్రీడా పరంగా అన్ని విధాల అభివృద్ధి చేయాలని మంత్రి ఆలోచిస్తున్నారన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా కెనోయింగ్, కయా కింగ్ వంటి జల క్రీడలు, బీచ్ కబడ్డీ, వాలీబాల్ వంటి పోటీలు నిర్వహించాలని మంత్రివర్యులు సూచించారన్నారు. వారి సూచన మేరకు బీచ్ ను సందర్శించామని, ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించామని దేశంలోనే ఉత్తమమైన బీచ్ ఉత్సవాలుగా నిర్వహించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు మసుల ఫెస్ట్25 నామకరణం చేశారని త్వరలో డాల్ఫిన్ లోగోను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు గుర్తుగా ఈ చిహ్నాన్ని మలిచారన్నారు. అంతేకాకుండా అమరావతికి ముఖద్వారంగా నిర్మిస్తున్న శాశ్వత తోరణం ఆకృతి చాలా బాగుందన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా చారిత్రాత్మక తోరణం రూపుదిద్దుకోవడం సంతోషదాయకమన్నారు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సాంస్కృతిక, పర్యాటక రంగాలలో ఉన్న ప్రముఖులను ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. తద్వారా మచిలీపట్నం ప్రాముఖ్యత దేశవ్యాప్తంగా విస్తరించే పరిస్థితి ఉందన్నారు. మన రాష్ట్రానికి అతి పెద్ద సంపద సముద్ర తీరమని ఈ తీర ప్రాంతాన్ని ఎలా ఉపయోగించుకోవాలని, ఎలా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని, పర్యాటక రంగాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఆలోచిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా ఉత్తమ క్రీడలు ముఖ్యంగా బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, కెనొయింగ్, కయాకింగ్ జల క్రీడలు పెడల్ బోట్, డ్రాగన్ బోట్ వంటి నీటి పోటీలు నిర్వహిస్తామన్నారు. అందరినీ సమన్వయం చేసుకొని సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో శాప్ చైర్మన్ వెంట మెప్మా పీడీ సాయిబాబు, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి, విజయవాడ క్రీడల అధికారి కోటేశ్వరరావు, తహసీల్దారు హరినాథ్, జల క్రీడల జిల్లా అధ్యక్షులు దావులూరి సురేంద్రబాబు, ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఏపీమాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డు అందుకున్న డా. కొల్లూరి !



**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిలభారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి హోంశాఖ వైద్యశాఖ ఆర్థిక శాఖ జౌళి శాఖ విద్యుత్ శాఖ గృహ నిర్మాణ శాఖ తదితర మంత్రి పదవులను ఎంతో సమర్థవంతంగా పనిచేసిన రాజకీయ ఉద్దండుడు అపర చాణిక్యుడు మాన్యశ్రీ కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డును డా. కొల్లూరి అందుకున్నారు. నటరత్న డా నందమూరి తారకరామారావు 102వ జయంతి, దర్శకరత్న దాసరి నారాయణరావు 78వ జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నం కి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖరత్న కళాపరిషత్ వారు విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. కొల్లూరి నిస్వార్థ సేవలను గుర్తించిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖ-రత్న కళాపరిషత్ వ్యవస్థాపకులు సినీ దర్శకులు పి ఏ భాస్కర రావు ప్రతిభ సేవా సంస్థ వ్యవస్థాపకులు అడవి రాజు తదితరులు డా. కొల్లూరిని వస్త్ర కిరీటం దుశ్శాలువ తో ఘనంగా సత్కరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డును సేవా రంగంలో డా. కొల్లూరికి అందజేశారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సామాజిక వర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డును సేవా రంగంలో అందుకున్న ప్రథమ వ్యక్తిని కావడం ఎంతో సంతోషంగా ఉందని నాకు ఈ వార్డును అందజేసిన నిర్వాహకులకు డా. కొల్లూరి కృతజ్ఞతలు తెలియజేశారు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవ ప్రతినిధులు తో పాటు పట్టణ పుర ప్రముఖులతోపాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పలువురు డా. కొల్లూరికి అభినందనలు తెలియజేశారు.

# తుడా చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన డాలర్స్ దివాకర్ రెడ్డి





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్ గా బుధవారం తుడా కార్యాలయంలో ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య సమక్షంలో బాధ్యతలు చేపట్టిన డాలర్స్ దివాకర్ రెడ్డి.

# ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలకు వడపోత

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా నేపథ్యంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఆయా నియోజకవర్గాల్లోను, జిల్లాల్లోనూ అధికారుల పనితీరుపై నిఘా వర్గాల ద్వారా పూర్తి సమాచారం సేకరించిన ప్రభుత్వం తదనుగుణంగా చర్యలు తీసుకోనుంది. అన్ని కోణాలలో అధికారుల వ్యవహారశైలీలపై పూర్తి సమాచారం సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్స్, కేసులు నమోదు, అరెస్ట్ లు జరిగి పోయాయి. తాజాగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతమంది సివిల్ సర్వీసెస్ అధికారులు హైదరాబాదులో రహస్య సమావేశమయ్యారనే దానిపై కూడా ప్రభుత్వం పూర్తి సమాచారం సేకరించింది. కానీ ప్రభుత్వ అధినేత ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసారి ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల్లో సమర్థులకు స్థానం కల్పించాలని సీఎం నిర్ణయించారు. ఆ మేరకు పలు వడపోతల అనంతరం ఒక ప్రాథమిక జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని దాదాపు 12 నుంచి 14 మంది ఎస్పీలు బదిలీ అయ్యే అవకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 6గురు డిఐజిలకు కూడా బదిలీ జాబితాలో ఉన్నారు. నలుగురు ఐజిలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే సమాచారం. గుంటూరు, ఏలూరు రేంజ్ లకు కొత్త పోలీస్ బాస్ లు రానున్నారని తెలుస్తోంది. అదేవిధంగా విశాఖపట్నం కమీషనర్ మార్పు కూడా ఉండనున్నట్లు సమాచారం. ఈ బదిలీల ప్రక్రియలో ఒక రిటైర్డ్ డిజిపి చక్రం తిప్పుతున్నారు. దీంతో మంచి పోస్టింగులు ఎవరికి దక్కుతాయి, లూప్ లైన్ లోకి వెళ్లేది ఎవరు అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. అయితే వ్యవస్థను గాడిలో పెట్టాలనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఈ బదిలీలు ఉంటాయని సమర్థులైన అధికారులకు తమ ప్రభుత్వంలో స్థానం ఉంటుందనే మెస్సేజ్ ఇవ్వటానికి ప్రభుత్వాధినేత ప్రయత్నిస్తున్నారు. ఇది ఎంతవరకు సఫలీకృతమవుతుందో వేచి చూడాలి.

# యోగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కృషి చేయాలి- జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు





**తిరుపతి, కలంకౌంటర్ :** అంతర్జాతీయ యోగా డే జూన్21 నేపథ్యంలో యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టన్ రైజర్ యోగ కార్యక్రమం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని మల్టి పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు నిర్వహణ, పాల్గొన్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తిరుపతి లోని శ్రీ. పద్మావతి మహిళా మల్టిపర్పస్ కాంప్లెక్స్ నందు జూన్ 21 అంతర్జాతీయ యోగా డేని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు కార్యక్రమంలో పాల్గొని యోగా కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మీడియా తో మాట్లాడుతూ మే 21 నుంచి జూన్ 21 వరకు ఒక నెలపాటు యోగాంధ్ర మాస ఉత్సవాల జరగనున్నాయి. యోగా ను ఊరు వాడ లోని ప్రజల్లోకి బాగా తీసుకెళ్ళే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలి. యోగా విశిష్టతను ప్రజలుకు తెలిసే విధంగా కార్యక్రమాలు చేయాలి. యోగాను మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా తెలిసే విధంగా చేయాలి.కలెక్టర్ , నేను కూడా దీనిలో భాగస్వాములుగా చేరి ఈరోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది . తిరుపతి జిల్లా వ్యాప్తంగా పలు ప్రదేశాల్లో ఈ యోగ కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.యోగా అనేది శరీరక, మానసిక, మరియు ఆధ్యాత్మిక ను పెంపొందిస్తుందన్నారు. యోగా శరీరం, మనసును రోజంతా ప్రశాంతంగా చేస్తుంది

# జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం










**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖమంత్రి కొలుసు. పార్ధసారధి. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని. సత్య ప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్, జిల్లా కలెక్టర్ వెంకటరమణ, జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

# యోగా సాధన సంపూర్ణ ఆరోగ్యం





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** యోగా సాధనతో ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, యోగ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యులై ఆరోగ్యవంతులు కావాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పిలుపునిచ్చారు. రానున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో బుధవారం ఉదయం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత జాతీయ, అంతర్జాతీయ యోగా పోటీలలో బంగారు పతకం సాధించిన శిరీష ఆధ్వర్యంలో నిర్ణీత ప్రోటో కాల్ ప్రకారం వజ్రాసనం,తాడాసనం, వృక్షాసనం, త్రికోణాసనం, ఉష్ట్రాసనం, శశాంకాసనం, మకరాసనం, భుజంగాసనం, సేతుబంధాసనం, ఉత్థాన పాదాసనం, పవనముక్తాసనం, అమృతాసనం వంటి ఆసనాలు, కపాల భాతి, నాడీ శోధన, శీతలి, భ్రామరి ప్రాణాయామాలు అందరిచేత చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే జూన్ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు బుధవారం యోగాంధ్ర 2025 కార్యక్రమం ప్రారంభించామని, జూన్ 21వ తేదీ వరకు నెలరోజులపాటు జిల్లాలో యోగా పోటీలు తదితర పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా సాధన వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా మనసుతో శరీరం అనుసంధానం కావడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా ప్రశాంతమైన జీవనం సాగించవచ్చున్నారు. యోగ కార్యక్రమాలను ఆయుష్ శాఖ వివిధ యోగా సంఘాల సహకారంతో జిల్లా స్థాయిలోనే కాకుండా మండల, గ్రామస్థాయిలో కూడా నిర్వహిస్తామని, యోగ గురువులు వారి శిష్య బృందంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ యోగ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవి సెలవులు అయ్యాక కళాశాలలు, పాఠశాలల్లో కూడా ఈ యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు వచ్చే జూన్ 21వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం 2 కోట్ల మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలని తలపెట్టిందన్నారు. జిల్లాలో ఆరోజున మంగినపూడి బీచ్ లో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం యోగా కార్యక్రమాలు నెల రోజులు చేస్తున్నప్పటికీ అంతటితో ఆపకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధతో తమ ఆరోగ్యం కోసం నిరంతరం యోగా సాధన చేయాలన్నారు. ఈ యోగ కార్యక్రమాలలో ప్రజలందరూ భాగస్వాములై. ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించిన శిరీషను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్డిఓ కే స్వాతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, జిల్లా విద్యాధికారి రామారావు, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి, డీఎస్పీ సిహెచ్ రాజా, ఆర్ ఐ ఓ సాల్మన్ రాజు, ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి జావేద్ ఖాన్, డాక్టర్ భాగ్యలక్ష్మి, యోగా గురువులు గురునాథ బాబు, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30 నాటికి నాటు సారా రహిత రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్

## -రాష్ట్ర అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా






**అమరావతి ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా నుండి పూర్తిగా విముక్తం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (ఎక్సైజ్, జిఏడి-రాజకీయం) ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (ఎక్సైజ్) ముఖేష్ కుమార్ మీనా రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రం మొత్తాన్ని నాటు సారా రహితంగా మార్చాలని తుదిగడువు విధించారు. అధికారులు తక్షణ చర్యలకు దిగాలని ఆదేశించారు. కాకినాడ, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గత అనుభవాల ఆధారంగా ప్రత్యేక వ్యూహాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. అలాగే, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ప్రవాహాన్ని నిరోధించేందుకు గతంలో తీసుకున్న చర్యలు ఫలప్రదంగా ఉన్నా, మరింత నిఘా అవసరమని అభిప్రాయపడ్డారు. రూ.99 మద్యం బ్రాండ్లు ప్రవేశపెట్టడం వల్ల కట్టడి పక్కాగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను సమీక్షించారు. మద్యం విక్రయాల్లో ఎంఆర్పీకి కట్టుబడి ఉండటం, నిర్ణీత సమయాల్లో మాత్రమే అమ్మకాలు జరగడం తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాల అధికారులు తమ కేంద్రాలలోనే ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలన్నారు. రాత్రిపూట సీనియర్ అధికారుల పహారా తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అధికారులు ప్రజలతో సంబంధాలు మెరుగుపరచాలని, సమస్యలపై వెంటనే స్పందించేలా వ్యవస్థను సజావుగా నడిపించాలని సూచించారు. రాష్ట్రాన్ని అక్రమ మద్యం నుంచి పూర్తిగా విముక్తం చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు సమన్వయంతో, కట్టుదిట్టమైన చర్యలతో ముందుకు సాగాలని పునరుద్ఘాటించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ రాష్ట్రవ్యాప్తంగా నమోదైన ఐడి లిక్కర్ కేసులు, ఎన్డీపీఎల్ కేసులు , పెండింగ్ అరెస్టులపై సమీక్ష నిర్వహించారు. తీవ్రమైన కేసులను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్లు దర్యాప్తు చేయాలని, చార్జ్‌షీట్లు వేగంగా దాఖలు చేయాలని, అవసరమైతే పీడీ చట్టం ప్రయోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం రూపొందించిన డైరీ-కమ్-హ్యాండ్బుక్‌ను ఆవిష్కరించారు.

# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట - రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం నగరంలోని 38వ వార్డులో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రం భవనానికి రాష్ట్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రధానంగా ప్రజల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్న ప్రదేశం 500 గజాల ప్రభుత్వ స్థలమని, గతంలో అన్యాక్రాంతం అయ్యే పరిస్థితి ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అడ్డుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేపట్టామని, ఈ కేంద్రం నిర్మాణం పూర్తయితే ఇక్కడ పరిసర ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి



ముఖ్యంగా డయాలసిస్ రోగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఆర్ మచిలీపట్నంలోని వైద్య కళాశాల అనుసంధానంగా ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. వైద్య కళాశాలలో ఫిజికల్ ఫిట్నెస్ కేంద్రం ఏర్పాటుకు 12 కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచామని త్వరలో పనులు మొదలవుతాయన్నారు. పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఉందని బందరు పట్టణం ప్రముఖ ఆరోగ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుండి 3 కోట్ల రూపాయలను ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు అందజేశామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయ్యాక పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, మునిసిపల్ డి. ఈ. కుబియా నాయక్, ఏఈ రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, బుల్లయ్య , పీవీ గజేంద్రరావు, కార్పొరేటర్ అన్నం ఆనంద్,ప్రముఖ వ్యాపార వేత్త అన్నం బాబురావు , అధికారులు, అనధికారులు, వైద్య ఆరోగ్య మున్సిపల్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఫతుల్లాబాదలో గల స్వయంభుగా ఉన్న శ్రీ ప్రపత్తి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న "శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి" వార్ల కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు రామసారథి సారధ్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ పుణ్య దంపతుల చే పూజాదికాలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి "కళ్యాణాన్ని" అంగరంగ వైభవముగా కన్నుల పండుగగా భక్తుల నడుమ వేద పండితులు నిర్వహించారు. అనంతరం ఆగమ శాస్త్రం ప్రకారం "శాంతి హెూమాన్ని" పుణ్య దంపతులచే గావించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేసి స్వామివారి కరుణాకటాక్షాలు కలగాలని ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగరఅధ్యక్షులు గడ్డం రాజు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ దేవదేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండేలా శుభాలు కలగాలని భగవంతుని కోరినట్టు గడ్డం రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారపర్య ప్రధాన అర్చకులు రామసారధి మాట్లాడుతూ హనుమ జయంతిని పురస్కరించుకొని "శ్రీ ప్రపత్తి



ఆంజనేయస్వామి" వారికి అత్యంత వైభవంగా జయంతి వేడుకలు నిర్వహిస్తామనిభక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

# తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ ఉంటుంది

● నాలుగు దశాబ్దాలుగా పార్టీని కాపాడుతున్నది కార్యకర్తలే ● కార్యకర్తకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుంది




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రజాస్వామ్యబద్ధమైన సిద్ధాంతాలు, విధివిధానాలు, గత 44 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీని కాపాడుతున్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో మాట్లాడారు. తెలుగు ప్రజల కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీ స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలి. రాష్ట్రంలో అనేక రాజకీయ పార్టీలు ఏర్పడినప్పటికీ.. అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీది మాత్రమే. నాడు ఏ ఆశయాలతో పార్టీని స్థాపించారో.. తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం నిలిచే ఉంటుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వాలు నమోదు చేసుకుని, సంస్థాగతంగా పార్టీ కమిటీలు



నిర్మించుకుంటున్నాం. గ్రామస్థాయిలో ఉన్న కమిటీల ఆధ్వర్యంలో సంస్థాగత నిర్మాణం చేసుకుంటున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కోటి సభ్యత్వాలతో సరికొత్త రికార్డులు సృష్టించాం. రాజకీయ నాయకుల కారా?నా తెలుగుదేశం పార్టీ. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఒకప్పుడు మన పార్టీలో కార్యకర్త నుండి ఎదిగిన వారే. తెలుగు జాతిని ప్రపంచ పటంపై అగ్రస్థానంలో నిలిపించడాలనే లక్ష్యంతో చంద్రబాబు శ్రమించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా ఐటీలో మన తెలుగు వారు అగ్రస్థానంలో ఉన్నారు. 42 సంవత్సరాలుగా తిరుగులేని నాయకత్వంతో ముందుకు వెళ్తున్నాం. కొత్త ఆలోచనతో కుటుంబ సాధికార సారధుల్ని నియమించుకుని పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసుకుంటున్నాం. ఈ వ్యవస్థను పటిష్టపరచుకుంటే.. 2029 ఎన్నికల్లో 100 % స్ట్రైక్ రేట్ సాధిస్తాం. 2014 లో గెలిచిన తర్వాత ఈ విధానాన్ని అమలు చేయాలనుకున్నప్పటికీ కుదరలేదు. ఫలితంగా 2019లో ఓటమి పాలై రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసుకున్నాం. కుట్రలు కుతంత్రాలు, అరాచకాలకు పాల్పడ్డారు. ఎన్ని కేసులు పెట్టి వేధించినా.. తెలుగుదేశం పార్టీ నాయకులు చెక్కు చెదరకుండా నిలబడ్డారు. అక్రమ కేసులో నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టినపుడు.. పార్టీ కార్యకర్తలు అందించిన భరోసా ఎప్పటికీ మరచిపోలేను. పైగా భారీ మెజార్టీతో విజయం సాధించాం. పార్టీ నిర్మాణం నుండి కార్యక్రమాల వరకు అన్నింటా కార్యకర్తలకు గౌరవం ఇస్తున్నారు. కష్టబడి పని చేసిన వారు ఎక్కడున్నా పదవులిచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీది. నాడు కొనకళ్ల నారాయణరావు ,బచ్చుల అర్జునుడు , నడకుదిటి నరసింహారావు ఇలా ఎంతోమంది ఈ ప్రాంత నాయకులకు పిలిచి గౌరవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే. గత ఐదేళ్లు సంక్షేమం పేరుతో చేసిన దోపిడీని గుర్తించి.. జగన్ రెడ్డిని ఇంటికి పంపించారు. వైనాట్ 175 అన్న వారిని తన్ని తరిమేశారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వాన్ని 93 శాతం స్ట్రైక్ రేట్ తో గెలిపించుకున్నారు. అమరావతి, పోలవరం పనులు ప్రారంభించుకున్నాం. గుంతల మయమైన రోడ్లను అభివృద్ధి చేసుకున్నాం. గ్రామ గ్రామానా సిమెంటు రోడ్లు నిర్మించుకున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. హామీ మేరకు ఏప్రిల్ నుండే అమలు చేస్తూ రూ.4000 చొప్పున అందిస్తున్నాం. మూడు గ్యాస్ సిలిండర్ల హామీని అమలు చేశాం. భూముల్ని దోచుకోవడానికి జగన్ రెడ్డి చేసిన కుట్రల్ని భగ్నం చేసి.. భూ భక్షక చట్టాన్ని రద్దు చేశాం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు పథకాలను త్వరలోనే అమలు చేయబోతున్నాం. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలనే లక్ష్యం నిర్దేశించుకున్నాం. కేంద్రం నుండి మూడు విడతల్లో రూ.6000 వస్తే, రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14వేలు ఇవ్వబోతున్నాం. ప్రజాస్వామ్య బద్ధంగా నడచుకుంటున్న ప్రభుత్వంపై జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడు. కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు రోడ్డు ప్రమాదాన్ని కూడా తెలుగుదేశం పార్టీకి ఆపాదించేందుకు ప్రయత్నించి భంగపడ్డాడు. మరోవైపు వక్ఫ్ బిల్లు విషయంలో డబుల్ గేమ్ ఆడాడు. లోక్ సభలో బిల్లును వ్యతిరేకించి, రాజ్యసభలో మద్దతిచ్చాడు. ఏపీలో బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు మాట్లాడాడు. జగన్ రెడ్డి కుట్రలన్నింటినీ ప్రజలకు తెలియజేయాలి. 2024 ఎన్నికల్లో గెలవడం కాదు మరో 15 సంవత్సరాలు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే అభివృద్ధిని సాకారం చేసుకోగలం. విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారు. అమరావతి పున:ప్రారంభ పనులకు వచ్చినపుడు రూ.60 వేల కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. మళ్లీ జూన్ 21న యోగా డే వేడుకలు, శ్రీశైలంలో అభివృద్ధి పనులకు రాబోతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లాలి.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. మన కష్టంతో తెచ్చుకున్న బందరు పోర్టును 2026లో ప్రారంభించుకోబోతున్నాం. ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నాం. ఇప్పటికే ఉగాది నాడు టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు అందించాం. మరిన్ని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నాం. ఎంఎస్ఎంఈ పార్కుల్ని ఏర్పాటు చేసి మన బందరు పిల్లలకు స్వయం ఉపాధి కల్పిస్తాను. ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం కూడా ప్రణాళికలు రచిస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా మంజూరైన రుణాలను కూడా లబ్దిదారులకు అందిస్తున్నాం. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందిస్తాం. సాధారణ మరణాలకు కూడా రూ.5000 వరకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ 50 డివిజన్లను, 39 గ్రామ పంచాయతీలను ఏకపక్షంగా గెలిచేలా కార్యకర్తలు పని చేయాలి. పొత్తులో ఏ డివిజన్ ఏ పార్టీ అభ్యర్థికి కేటాయించినా.. అందరూ కలిసి పని చేయాలి. గెలిపించుకోవాలి. మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి చేయాలనుకున్నా.. వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న మహానాడుకు మచిలీపట్నం నుండి తరలి రావాలి. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు కూడా భాగస్వాములు కావాలి. జూన్ 6, 7, 8 తేదీల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మచిలీపట్నంలో మసులా బీచ్ ఫెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నాం. మచిలీపట్నాన్ని పర్యాటక రంగంలో అగ్రస్థానంలో నిలిపేలా మసులా బీచ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం. మనం అధికారంలో ఉన్నపుడు నీతి నిజాయితీతో అడుగులు వేసినపుడు మాత్రమే ప్రజలకు సేవ చేసే అవకాశం మరళా మరళా వస్తుంది. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలంతా ఒకే నినాదంతో పని చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com